



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 107 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా | శుక్రవారం 1 మే 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 107 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NTR DIST, | FRI 1 MAY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## పాత బిల్డింగ్ లు కనిపిస్తే.. ఈ నంబర్ కు ఫోటోలు, లొకేషన్ షేర్ చెయ్యండి




పెన్ పవర్ డెస్క్:హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో శిథిలా వస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని ప్రమాదకర బిల్డింగ్ లపై అలర్ట్ అయ్యింది. ఏప్రిల్ 29న బెంగళూరులో కురిసిన భారీ వర్షాలకు ఓ ప్రహరీ గోడ కూలి ఏడుగురు ప్రా ణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. గతంలో హైదరాబాద్‌లో కూడా ఇలాంటి

మిగతా 2లో

## హార్మూజ్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది

- లిఖిత పూర్వక ప్రకటన విడుదల చేసిన ఇరాన్ సుప్రీం లీడర్
- దిగ్బంధం కొనసాగుతున్నా, ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను పరిరక్షించుకుంటోందని వెల్లడి
- పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్ల ఏకైక స్థానం జలాల అడుగున అని చురక

మిగతా 2లో



పెన్ పవర్ డెస్క్:అమెరికా అవమానకర వైఫల్యంతో హార్మూజ్ జలసంధిలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్, హార్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం రూపుదిద్దుకుంటోందని అన్నారు. ఈ మేరకు ఆయన లిఖిత పూర్వక ప్రకటన విడుదల చేశారు. హార్మూజ్ జలసంధిలో అమెరికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పటికీ,




## డబ్బుతో కొనేశారు...

### ఎగ్జిట్ పోల్స్ పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు

- ఎగ్జిట్ పోల్స్ అన్నీ బూటకం అంటూ మమతా ఫైర్
- మీడియాకు బీజేపీ డబ్బులిచ్చి తప్పుడు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయించిందని ఆరోపణ
- స్టాక్ మార్కెట్ పతనాన్ని, కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీయడానికే ఈ కుట్ర అని ఆగ్రహం
- ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను కాపాడాలని కార్యకర్తలకు పిలుపు
- తాను కూడా వ్యక్తిగతంగా వీధుల్లోకి వచ్చి కాపలా కాస్తానన్న దీదీ

మిగతా 2లో

## మా వాటా వెంటనే విడుదల చేయండి..

## తెలంగాణకు ఏపీ తెలుగు అకాడమీ డిమాండ్

- ఏపీ వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణను డిమాండ్ చేసిన తెలుగు అకాడమీ
- సుప్రీంకోర్టు ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపణ
- నిధుల కొరతతో అకాడమీ కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులున్నాయన్న ఛైర్మన్ విల్సన్
- ఇంటర్ పుస్తకాల బకాయిలు రూ.50 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి
- అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి

మిగతా 2లో




## నేడు కృష్ణా జిల్లాలో చంద్రబాబు పర్యటన...

- శుక్రవారం కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన
- పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేక ముఖాముఖి
- గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభించనున్న చంద్రబాబు
- ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు పింఛన్లు అందించి వారితో ముచ్చటించనున్న ముఖ్యమంత్రి

మిగతా 2లో




## ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

### ఆమోదం పొందిన 41 అంశాలు ఇవే!




- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం
- వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్
- అమరావతి నిర్మాణ పనులు, కరకట్టకు నిధులు, పోలవరం నిర్వాసితులకు లబ్ధి
- 23 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు
- పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పరిపాలన ఆమోదం

మిగతా 2లో




# 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు ఘనత మీదే..

## ప్రభుత్వ యంత్రాంగానికి చంద్రబాబు ఆత్మీయ విందు

- చంద్రబాబుకు ఇటీవల జాతీయస్థాయిలో బిజినెస్ రిఫార్మర్ అవార్డు నే
- మంత్రులు, అధికారులకు సీఎం ఆత్మీయ విందు
- మీరే అసలైన విజేతలు అంటూ ప్రభుత్వ యంత్రాంగానికి ప్రశంసలు
- జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించిన సీఎం
- సంస్కరణలు చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయన్న మంత్రి పయ్యావుల
- భవిష్యత్ లక్ష్యాలు, వ్యూహాలపై ఉన్నతాధికారులతో సీఎం కీలక సమావేశం

పెన్ పవర్ డెస్క్:తనకు జాతీయ స్థాయిలో 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్–2025' పురస్కారం లభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగానికి ఆత్మీయ విందు ఇచ్చారు. 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' పేరుతో అమరావతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన మంత్రులు, అధికారులు, ఉద్యోగులే అసలైన విజేతలని సీఎం ఈ సందర్భంగా అభివర్ణించారు.

ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సమావేశ ప్రాంగణానికి సీఎం చంద్రబాబు చేరుకోగానే మంత్రులు, అధికారులు చప్పట్లతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ విందుకు మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు, క్షేత్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులను కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. ఈ పురస్కారం రావడానికి 'టీమ్ ఏపీ' సమష్టి కృషే కారణమని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని, ఈ విజయాన్ని అందరితో కలిసి పంచుకోవడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశానని తెలిపారు.

ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, సంస్కరణలు అనేవి ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎన్ఏలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్, ఓపెన్ స్కై పాలసీ, టెలికాం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి ఎన్నో రంగాల్లో ఆయన ముందుచూపుతో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన అనంతరం, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎదుర్కొన్న సవాళ్లను కూడా ఆయన ప్రస్తావించారు. విందు కార్యక్రమానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై విస్తృతంగా చర్చించారు. పరిపాలనలో మరింత వేగం పెంచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించినట్టు సమాచారం.

### గూడూరులో 45.8 డిగ్రీల

## ఉష్ణోగ్రత..

## ఈ సీజన్ లో ఇదే రికార్డ్!



- నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డు స్థాయిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత
- రాష్ట్రవ్యాప్తంగా 216 మండలాల్లో 41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న రెండు రోజులు తీవ్ర వడగాల్పులు, అకాల వర్షాల హెచ్చరిక
- పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం
- ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

మిగతా 2లో

## 'టెన్త్'లో ఫలించిన లోకేష్ వ్యూహం..

### 100 రోజుల ప్లాన్ తో మెరుగైన ఫలితాలు



- ఏపీలో టెన్త్ ఫలితాలు విడుదల
- విద్యాశాఖ అమలు చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- సమష్టి కృషితోనే మెరుగైన ఫలితాలు సాధించామన్న మంత్రి లోకేష్
- గతేడాది 81.1% ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి 85.25 శాతానికి చేరిక
- ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తీర్ణత 72.8% నుంచి 78.39 శాతానికి మెరుగుదల
- ఫలితాల్లో బాలుర కంటే బాలికలు 5.22 శాతం అధిక ఉత్తీర్ణత

పెన్ పవర్ డెస్క్:పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం అనేది ఐకమత్యంగా, అంకితభావంతో సాధించిన సమష్టి విజయమని రాష్ట్ర విద్యాశాఖ

మిగతా 2లో

## నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం...

# 17 మంది మృతి

- జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళ్తుండగా ప్రమాదం
- అదుపుతప్పి 700 మీటర్ల లోయలో పడిన ప్రైవేటు జీపు
- వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారిపడిందన్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోల్పా జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఒక జీపు అదుపుతప్పి 700 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న

మిగతా 2లో



## ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

- ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

మిగతా 2లో






# వైసీపీకి రానున్న రోజులన్నీ మంచివేనా.. సంకేతాలు అవేగా?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తక్కువగా అంచనా వేయడానికి వీలు లేదు. ఇప్పటికీ వైసీపీకి నలభై శాతం ఓటు బ్యాంకు ఉంది. జగన్ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి మధ్య ప్రజలు బేరీజు వేసుకోవడం ప్రారంభించారు. జగన్ అప్పులు చేసినప్పటికీ నాడు జనానికి డబ్బులు పంచారని, నేడు కూటమి ప్రభుత్వం అప్పులు చేసినా జనాలకు మాత్రం చేరడం లేదన్న వాదన బలంగా ఉంది. వైసీపీ బలం నేటికీ చెక్కు చెదరలేదు. రానున్న కాలంలో ఇంకా పెరగడమే తప్పించి తగ్గేది ఉండదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి పార్టీలు కలసి ఉన్నప్పటికీ జగన్ కు మరోసారి పట్టం కడితే తమకు ఆర్థిక సమస్యలు తీరతాయన్న భావనలో అనేక వర్గాలున్నాయి.

**రైతుల్లోనూ సానుకూలత...**

కూటమి ప్రభుత్వం మంచి జరిగితే అది తమ క్రెడిట్ గానూ, చెడు జరిగితే నాటి వైసీపీ ప్రభుత్వం వల్లనేనని చెబుతుండటం కూడా ప్రజలకు పాలన ఎవరి సమయంలో ఎలా ఉందన్నది సులువుగానే అర్థమవుతుంది. ప్రధానంగా రైతులు కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు పడుతున్నారు. తుపానులు వచ్చిన సమయంలోనూ పరిహారం అందడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇవన్నీ రైతులు లెక్క వేసుకుని మరీ అన్నదాతలు మరొకసారి జగన్ కు జై కొట్టినా ఆశ్చర్యంలేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు కరోనా తో తీవ్ర ఇబ్బందులు పడినప్పటికీ తమకు ఆర్థిక సమస్యలు రాలేదన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

**తాజాగా పెట్రోలు, డీజిల్ సమస్య...**

ఇక తాజాగా పెట్రోలు, డీజిల్ సమస్య కూడా కూటమి ప్రభుత్వానికి మైనస్ గా మారగా, వైసీపీకి ప్లస్ అయిందంటున్నారు. రైతులు, ఆటో డ్రైవర్లు, మధ్యతరగతి ప్రజలు కూటమి ప్రభుత్వ పాలన తీరును ప్రశ్నిస్తున్నారు. కేవలం అమరావతిలో నిర్మాణ సంస్థలకు డీజిల్ సరఫరా చేయడం కోసం కోట్ల లీటర్ల డీజిల్ ను తరలించి సామాన్యులకు అన్యాయం చేశారన్న అభిప్రాయం జగన్ కు అనుకూలంగా మారనుంది. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు కూడా తాము జగన్ కు ఈసారి ఓటేస్తామని బహిరంగంగానే చెబుతుండటం విశేషం. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ ప్రస్తుతం అయితే మాత్రం క్షేత్రస్థాయిలో వైసీపీకి అనుకూలంగానే ఉన్నాయి.

# ‘టెన్త్’లో ఫలించిన లోకేష్ వ్యూహం..

## 100 రోజుల ప్లాన్ తో మెరుగైన ఫలితాలు

- మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, అయితే అమలు చేసిన ప్రణాళికలు విజయవంతం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల్లో నైతిక విలువలు, సమగ్ర వికాసం కోసం మరింత కృషి చేయనున్నట్లు తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి సమాజ సహకారం ఎంతో అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఫెయిలైన వారు ఆత్మన్యూనతకు గురికావొద్దని, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చని భరోసా ఇచ్చారు.

**100–రోజుల కార్యాచరణ ప్రణాళిక**

“పూను స్పర్థలు విద్యలందే–వైరములు వాణిజ్యమందే” అనే గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ‘ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్’ మిషన్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా రూపొందించిన ‘100–రోజుల కార్యాచరణ ప్రణాళిక’ సత్ఫలితాలనిచ్చింది. 2025 డిసెంబర్ 6 నుంచి 2026 మార్చి 15 వరకు పకడ్బందీగా అమలు చేసిన ఈ ప్రణాళికలో, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా 46 స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఈ మార్కులను ‘లీప్’ మొబైల్ యాప్‌లో నమోదు చేసి, ప్రతిరోజూ 6 డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా విశ్లేషించారు.

**షైనింగ్ స్టార్స్ .. రైజింగ్ స్టార్స్**

స్లిప్ టెస్టులలో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారిని ‘షైనింగ్ స్టార్స్’, ‘రైజింగ్ స్టార్స్’గా గుర్తించారు. వారి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**సాధనే విజయం**

“సాధనమున పనులు సమకూరు ధరలోన” అన్న వేమన వాక్కును నిజం చేస్తూ, విద్యార్థులతో క్రమం తప్పకుండా సాధన చేయించడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేకంగా మోడల్ పేపర్లు, క్వశ్చన్ బ్యాంకులను ఉచితంగా అందించింది. ముఖ్యంగా, నాన్–లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం ద్విభాషా (బై–లింగ్యువల్) పద్ధతిలో, ఒకవైపు తెలుగు మరోవైపు ఇంగ్లీషులో ప్రశ్నపత్రాలు రూపొందించి ఇవ్వడం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడింది.

**ఏ ఒక్క అవకాశం జారకుండా**

డ్యాష్‌బోర్డ్ విశ్లేషణ ద్వారా విద్యార్థుల బలాబలాలను ముందుగానే అంచనా వేశారు. దీనికి అనుగుణంగా ప్రతి పాఠశాలకు 15 కార్యాచరణ ప్రణాళిక పుస్తకాలను పంపిణీ చేశారు. స్లిప్ టెస్టులలో వెనుకబడిన విద్యార్థుల కోసం 30 రోజుల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా నిర్వహించి, వారిపై దృష్టి సారించారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రీ–ఫైనల్, గ్రాండ్ టెస్టులు నిర్వహించారు.

**అమలు చేసిన పథకాలు ఇవీ**

ఈ కార్యాచరణ ప్రణాళికతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా విద్యార్థులకు అండగా నిలిచాయి. రుచికరమైన మధ్యాహ్న భోజనం, ‘సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర’ పేరుతో యూనిఫాం, బ్యాగు, షూ, పుస్తకాలు వంటివి ఉచితంగా అందించారు. ‘తల్లికి వందనం’ పథకం ద్వారా తల్లులకు ఆర్థిక ప్రోత్సాహం కల్పించారు. ఈ సమన్వయ కృషి ఉత్తమ ఫలితాలకు బాటలు వేసింది.

**కృషికి తగ్గ ఫలితాలు**

మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణ, అధికార యంత్రాంగం కృషి ఫలితంగా, మార్చి 2026 పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. గతేడాది 81.1%గా ఉన్న ఉత్తీర్ణత, ఈ ఏడాది 85.25 శాతానికి చేరింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉత్తీర్ణత 72.8% నుంచి 78.39 శాతానికి పెరగడం విశేషం.

**భళా బాలిక**

ఈ ఏడాది ఫలితాల్లో బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణత 82.68% కాగా, బాలికలు 87.90% ఉత్తీర్ణతతో సత్తా చాటారు. బాలుర కంటే 5.22% అధిక ఉత్తీర్ణత సాధించి ‘భళా’ అనిపించుకున్నారు.

**ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్న**

రాష్ట్రవ్యాప్తంగా సున్నా శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 16 ఉండగా, వాటిలో 11 ప్రైవేట్ పాఠశాలలు కావడం గమనార్హం. ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలలు కేవలం 5 మాత్రమే ఈ జాబితాలో ఉన్నాయి. ఇది ప్రభుత్వ విద్య నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోందని విద్యా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం... 17 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

వారిలో పదిహేడు మంది మృతి చెందారు. స్థానికులు జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారిపడిందని పోలీసులు తెలిపారు. ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అన్నారు. ఘటన సమయంలో వాహనంలో ఎంతమంది ఉన్నారనే విషయం తెలియాల్సి ఉంది.

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ... ఆమోదం పొందిన 41 అంశాలు ఇవే!

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. హోంశాఖ, న్యాయ, పంచాయతీరాజ్, పరిశ్రమలు, పురపాలక, జలవనరులు, రెవెన్యూ వంటి అనేక శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

**క్యాబినెట్ తీసుకున్న 41 కీలక నిర్ణయాలు ఇవే...**

1. 23 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 385 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం.
2. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని న్యాయ విభాగాల్లో 5 చీఫ్ కోర్ట్ మేనేజర్, 15 సీనియర్ కోర్ట్ మేనేజర్ పోస్టులతో సహా మొత్తం 21 కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం.
3. న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ కార్యాలయం కోసం ఒక ఆఫీస్ మేనేజర్ పోస్టును కొత్తగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం.
4. ఉపయోగంలో లేని 20 పోస్టులను రద్దు చేసి, పరిశోధన సంస్థల్లో అవసరమైన చోట 20 కొత్త పోస్టులను సృష్టించడానికి ఆమోదం.
5. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో భాగంగా డ్రెడ్జింగ్, పర్యావరణ నిబంధనల మేరకు అదనపు పనుల కోసం రూ.354.23 కోట్లకు పరిపాలన అనుమతి. ఇది మొత్తం ప్రాజెక్టు వ్యయంలోనే సర్దుబాటు అవుతుంది.
6. మార్క్‌ఫెడ్ రూ.1800 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ లోన్ తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి క్యాబినెట్ ఆమోదం.
7. ఢిల్లీలోని 11.53 ఎకరాల స్థలంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించేలా రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి ఆమోదం. నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌బీసీసీకి అప్పగింత.
8. రాష్ట్రంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 2 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీల నుంచి మినహాయింపు. దీనివల్ల రూ.25 కోట్ల విలువైన ప్రాజెక్టులకు లబ్ధి.
9. పురపాలక సంఘాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజుకు సంబంధించి ఏకరీతి విధానం. ప్రతి ఏటా 7% అద్దె పెంచేలా నిబంధన.
10. కమర్షియల్ కాంప్లెక్స్‌లలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పోలిస్తే ఫస్ట్ ఫ్లోర్‌పై 20 శాతం, సెకండ్ ఫ్లోర్‌పై 30 శాతం తక్కువ అద్దె ఉండేలా నూతన విధానం.
11. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుకు సంబంధించి ఏకరీతి ఆటో మ్యూటేషన్ ఛార్జీల విధానానికి ఆమోదం.
12. కృష్ణా నది కుడిగట్టు (కరకట్ట) పటిష్టత, విస్తరణ పనులకు రూ.443 కోట్లతో సవరించిన అంచనాలకు ఆమోదం. గతంలో కాంక్రీట్ వాల్ కోసం వేసిన రూ.1304 కోట్ల అంచనాను రద్దు చేశారు.
13. అమరావతిలో సెక్రటేరియట్, హెచ్‌ఓడీ, జీఏడీ టవర్ల నిర్మాణంలో గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, ఇతర పనుల కోసం రూ.2540 కోట్లకు పరిపాలన ఆమోదం.
14. అమరావతిలో 43 అంతస్తులతో రెండు క్వాంటం టవర్ల (ట్విన్ టవర్స్) షెల్ అండ్ కోర్ నిర్మాణానికి రూ.1208 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్.
15. అసెంబ్లీ భవనం సెంట్రల్ స్పైర్, పార్కింగ్, అప్రోచ్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.798 కోట్లకు పరిపాలన అనుమతి.
16. ఉండవల్లి (జోన్–2) లేఅవుట్లలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.580 కోట్లకు ఆమోదం.
17. సీఆర్‌డీఏ పరిధిలో ఎన్10–ఎన్13 జంక్షన్ల వద్ద అండర్‌గ్రౌండ్ కేబుల్ రీ–రూటింగ్ కోసం సవరించిన అంచనా రూ.1180.54 కోట్లకు ఆమోదం.
18. గతంలో రెవెన్యూ శాఖకు బదలాయించిన సీఆర్‌డీఏ భూములను (ఆర్–5 జోన్‌తో సహా) తిరిగి సీఆర్‌డీఏకు అప్పగించడానికి క్యాబినెట్ నిర్ణయం.
19. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద రైతుల కౌలు పెంపు, కటాఫ్ తేదీ పొడిగింపు వంటి అభ్యర్థనలకు ఆమోదం.
20. సీఆర్‌డీఏ భూ కేటాయింపులు: సెబీకి 1.5 ఎకరాలు.
21. స్వామినారాయణ గురుకులానికి పాఠశాల కోసం భూమి.
22. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు భూమి.
23. డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు భూమి కేటాయింపులకు క్యాబినెట్ ఆమోదం.
24. పోలవరం నిర్వాసితులకు అదనపు ప్యాకేజీ కింద సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి యూనిట్ ధర రూ.3.57 లక్షలకు పెంపు.
25. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బయట ఇల్లు కట్టుకునే వారికి హౌస్ సైట్ కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు.
26. పుష్కర ఎత్తిపోతల పథకంలో ఎస్కేప్ ఛానల్ నిర్మాణం కోసం రూ.4.71 కోట్లను నామినేషన్ పద్ధతిపై కేటాయించేందుకు ఆమోదం.
27. హంద్రీనీవా సుజల స్రవంతి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులకు సవరించిన అంచనా రూ.309 కోట్లకు ఆమోదం.
28. తిరుపతి జిల్లా రేణిగుంటలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు కోసం సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్‌కు మార్కెట్ ధరకు 10 ఎకరాల భూమి కేటాయింపు.
29. కడప నగరంలో ఆధునిక డంపింగ్ యార్డ్ కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు 92 ఎకరాల భూమి బదలాయింపు.
30. ప్రకాశం జిల్లాలో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ హబ్ కోసం మార్కెట్ విలువకు 22 ఎకరాల భూమి.
31. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో ఫ్రూట్ ప్యాకింగ్ యూనిట్ కోసం ఏపీ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు 13 ఎకరాల కేటాయింపు.
32. అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా)కి ఎంఐజీ లేఅవుట్ కోసం 11 ఎకరాల భూమికి ఆమోదం.
33. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ కోసం ‘ఫిష్ ఇన్ ఇండియా’ సంస్థకు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి నిర్ణయం.
34. కాకినాడ అర్బన్‌లో కోర్టు కాంప్లెక్స్, నివాస భవనాల కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు.
35. విజయనగరం, ఒంగోలు, కర్నూలు, తూర్పుగోదావరి, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపు.
36. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ ట్రస్ట్ కోసం 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి ఆమోదం.
37. కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నీటి సరఫరా పనుల కోసం ఏపీఐఐసీ తీసుకున్న రూ.75 కోట్ల రుణ ప్రతిపాదనకు రాటిఫికేషన్.
38. సత్యసాయి జిల్లాలో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఆర్డీవోకు దాదాపు 600 ఎకరాల భూమి కేటాయింపునకు సూత్రప్రాయ అంగీకారం.
39. బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన అంచనా రూ.1586 కోట్లకు ఆమోదం.
40. కిసాన్ డ్రోన్ల వినియోగం కోసం మిగిలిన కేంద్ర నిధులను (దిరూ.14 కోట్లు) వాడుకునేందుకు పాత సంస్థకే కాంట్రాక్టు పొడిగింపు.
41. డిస్కంలు ఆర్ఈసీ నుంచి తీసుకునే రూ.7000 కోట్ల రుణానికి ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని పొడిగించడానికి క్యాబినెట్ ఆమోదం.

# నేడు కృష్ణా జిల్లాలో చంద్రబాబు పర్యటన...

ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (మే 1) శుక్రవారం కృష్ణా జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఒకే రోజు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా గడపనున్నారు. ‘పేదల సేవలో’ కార్యక్రమం, మేడే వేడుకలతో పాటు ఆసుపత్రి ప్రారంభోత్సవం వంటి కీలక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కలలో జరిగే ‘పేదల సేవలో’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారులతో ఆయన ప్రత్యేకంగా ముచ్చటిస్తారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించింది. ఒక్క కృష్ణా జిల్లాలోనే ప్రతినెలా 2.34 లక్షల మందికి రూ.102 కోట్ల పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పమిడిముక్కలలోని ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి పింఛను అందించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటారు.

అనంతరం మేడేను పురస్కరించుకుని భవన నిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం తర్వాత పామర్రు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

శుక్రవారం ఉదయం 10:15 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి పమిడిముక్కల మండలం వీరంకిలాకు గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10:25 గంటలకు పమిడిముక్కల ప్రజావేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:45 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1:55 గంటలకు పార్టీ నేతలతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3:40 గంటలకు గుడ్లవల్లేరు చేరుకుని, 3:50 గంటలకు అక్కడ నూతనంగా నిర్మించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ముగించుకుని సాయంత్రం 4:45 గంటలకు తిరిగి సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

# గూడూరులో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత.. ఈ సీజన్ లో ఇదే రికార్డ్!

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం అక్కడ ఏకంగా 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా 216 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. రేపు పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు.మరోవైపు, ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపారు.

ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్యంగా వర్షం పడే సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాల హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# మా వాటా వెంటనే విడుదల చేయండి.. తెలంగాణకు ఏపీ తెలుగు అకాడమీ డిమాండ్

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాల వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు.

నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తులు, డిపాజిట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీ చేయాలని గతంలోనే ఒప్పందం కుదిరింది. దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని, ఏపీ వాటాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలని 2021 హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తెలంగాణ నుంచి స్పందన లేదని ఏపీ అకాడమీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సందర్భంగా విల్సన్ ఏపీ ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. తమిళనాడు తరహాలో ఏపీలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అకాడమీ భవనం కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పాత బిల్డింగ్ లు కనిపిస్తే.. ఈ నంబర్ కు ఫోటోలు, లొకేషన్ షేర్ చెయ్యండి

- మొదటి పేజి తరువాయి

విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇలాంటి ప్రాణ నష్టాన్ని నివారించేందుకు, కూలే స్థితిలో ఉన్న పాత నిర్మాణాలను గుర్తించి వాటిని సురక్షితంగా కూల్చివేసేందుకు హైడ్రా సిద్ధమైంది.మీ పరిసరాల్లో ఎక్కడైనా ప్రమాదకరంగా ఉన్న పాత భవనాలు, గోడలు ఉంటే వెంటనే హైడ్రా హెల్ప్‌లైన్ నంబర్ 9000113667 కు సమాచారం అందించాలని హైడ్రా సూచించింది. మీరు ఫిర్యాదు చేసే సమయంలో ఆ బిల్డింగ్ ఫోటోతో పాటు కరెంట్ లొకేషన్ షేర్ చేస్తే అధికారులు తక్షణమే స్పందిస్తారని తెలిపింది. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపింది. అకాల వర్షాల నేపథ్యంలో ప్రమాదం ఏ క్షణమైనా సంభవించవచ్చు. కేవలం వర్షాకాలమే కాదు.. ఏ సమయంలోనైనా అప్రమత్తంగా ఉండాలని హైడ్రా సూచించింది.

# ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది.ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏపీలోని దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉండబోతున్నాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.తెలంగాణ విషయానికి వస్తే... హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని అధికారులు తెలిపారు.

# హార్మూజ్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది

- మొదటి పేజి తరువాయి

ఇరాన్ తన అణు, క్షిపణి సామర్థ్యాలను పరిరక్షించుకుంటుందని సుప్రీం లీడర్ తెలిపారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్ల ఏకైక స్థానం, ఆ సముద్ర జలాల అడుగున మాత్రమే ఉంటుందని ఎద్దేవా చేశారు. కాగా, ఈ జలసంధి వద్ద కొత్త నియమ నిబంధనలను అమలుచేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొజ్తబా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.అంతకుముందు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా అమెరికాకు కౌంటర్ ఇచ్చారు. ఇరాన్ ఓడ రేవులపై అమెరికా దిగ్బంధనం గల్ఫ్‌లో చమురు అంతరాయాలను మరింత తీవ్రతరం చేస్తుందని అన్నారు. తద్వారా అమెరికా తన లక్ష్యాలను సాధించడంలో విఫలం కావడం తథ్యమని పేర్కొన్నారు. సముద్ర దిగ్బంధం లేదా ఆంక్షల విధింపు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

# పట్టుదల కృషి ఉంటే విజయం పాదాక్రాంతం అవుతుంది..జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి..



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 30, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో కృషి చేస్తే ఎంతటి ఘన విజయమైనా పాదాక్రాంతం అవుతుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. పదవ తరగతిలో 590 మార్కులు సాధించిన కీర్తి శ్రీని అయన ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావుతోటలోని సాయి లిటిల్ పబ్లిక్ స్కూల్ వంటి చిన్న ప్రైవేట్ స్కూల్ నుంచి ఇంత విజయాన్ని సాధించటం మామూలు విషయం కాదన్నారు. ఈ విజయం వెనుక విద్యార్థిని కఠోర శ్రమ , తల్లిదండ్రుల త్యాగం , ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలతో అత్యున్నత స్థాయికి చేరాలని విద్యార్థినిని ఆశీర్వదించ్చారు. ఒకప్పుడు శ్రీనివాసరావుతోట అంటే అరాచకశక్తులకు నిలయంగా ఉండేదని ఇప్పుడు దానిని సరస్వతీ నిలయంగా మార్చిన ఉపాధ్యాయులు స్వర్గీయ చేబ్రోలు శ్రీను మాస్టారు , చందు శివ నాగేశ్వరావు , రుక్సా , బెల్లంకొండ ప్రభాకర్ లకు ఆళ్ళ హరి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 590 మార్కులు సాధించిన కీర్తి శ్రీకి నీ గమ్యాన్ని నువ్వే నిర్ణయించుకో అనే స్ఫూర్తిదాయక పుస్తకాన్ని బహుమతిగా అందచేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు స్టూడియో బాలాజీ , సాయి లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ బెల్లంకొండ ప్రభాకర్ , డైరెక్టర్ విజయలక్ష్మి, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో భక్తితో పాటు ధైర్యసాహసాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...ఎమ్మెల్యే గళ్ళా మాధవి .





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 30, గురువారం గుంటూరులోని సెయింట్ మాథ్యూస్ నార్త్ పారిస్ చర్చిలో నిర్వహించిన వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీఎస్ ) కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ౘ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి, చిన్నారులకు బహుమతులు అందజేశారు. తొలుత సిగ్నెట్ రింగ్" థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పాటలు, బైబిల్ బోధనలు, వేదిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.పారిష్ పాస్టర్ ఎస్. జోహన్ బాబు రావు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జొన్నలగడ్డ ఉదయ భాను ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీ ఎస్) వంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని, నేటి తరం పిల్లలు చదువుతో పాటు మంచి విలువలు, భక్తి, ధైర్యసాహసాలు కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. చిన్న వయసులోనే వేదికపైకి వచ్చి ధైర్యంగా మాట్లాడటం, తమ ప్రతిభను ప్రదర్శించడం ఎంతో గొప్ప విషయమని, ఇలాంటి వీబీ ఎస్ కార్యక్రమాలు పిల్లల్లో భయం తొలగించి సమాజంలో ధైర్యంగా ముందుకు వెళ్లే గుణాన్ని పెంచుతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అలాగే వేసవి సెలవులను సద్వినియోగం చేస్తూ పిల్లలకు బైబిల్ బోధనలు, నైతిక విలువలు, సహనం, ప్రేమ, పరస్పర గౌరవం వంటి మంచి విషయాలను నేర్పించడం అభినందనీయమని, నిర్వాహకులు,

టీచర్లు చిన్నారుల్లో భక్తితో పాటు మంచి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే బాధ్యతను ఎంతో సమర్థంగా నిర్వర్తిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నో సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్న పెద్దలను ఎమ్మెల్యే అభినందించారు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించి కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు కూడా ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# మోతీలాల్ నగర్ విషయంలో ఇకనైనా రాజకీయాలు ఆపండి... ఎమ్మెల్యే నసీర్...





గుంటూరు, పెన్ పవర్,ఏప్రిల్,30, పేద ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి కార్యక్రమానికైనా తాము మద్దతుగా నిలుస్తామని, సైకో జగన్ ఆలోచనలకు అనుగుణంగా ఇక్కడ వ్యవహరిస్తే సహించేది లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ఆనంద్ పేట, ఐపీడీ కాలనీల్లో రూ. 1.50 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రోడ్ల మీదకు వచ్చి విమర్శలు చేస్తున్న నాయకులు గత పదేళ్లలో ఎక్కడ అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆనందపేటలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్న నేపథ్యంలో స్థానికులతో మాట్లాడి పనులు చేపట్టామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతిపక్షం కూడాలేని కొందరు సోషల్ మీడియా ఆర్టిస్టులుగా మారి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. మంచి విషయాలు చెబితే తాము స్వీకరిస్తామని, ప్రజలను హాని చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గత పదేళ్ల సుద్దపల్లి రోడ్డు, మాయాబజారు రోడ్డు, నందివెలుగు బ్రిడ్జి వంటి పనులు మూలనపడేస్తే.. తాము అధికారంలోకి వచ్చాక పూర్తి చేశామని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా రూ. 50 కోట్లతో పనులు పూర్తి చేశామని, మరిన్ని పనులు జరుగుతున్నాయని చెప్పారు. మోతీలాల్ నగర్ వాసుల విషయంలో ఎలాంటి రాజీ లేదని, వారికి పూర్తి మద్దతుగా నిలుస్తామని అన్నారు. ఈ విషయంలో వైసీపీ నాయకులు చేస్తోన్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు.

# పోలీసు అధికారిపై అత్యాచార యత్నం ఆరోపణలు: న్యాయం కోరుతున్న బాధితురాలు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 30 : చిలకలూరిపేట : పట్టణంలో ధనలక్ష్మి అనే మహిళ మీడియాతో మాట్లాడారు వినుకొండ మండలం ధనలక్ష్మి అనే ఓ మహిళపై పోలీసు అధికారి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. బాధితురాలు ధనలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం, తాము బ్రాహ్మణపల్లిలో నివాసం ఉ ంటున్నామని, ఆ ఇంటిని లీజుకు తీసుకుని ఐదు నెలలుగా అక్కడే ఉంటున్నామని పేర్కొన్నారు. నిందితుడైన సి. హెచ్. చిన్న మల్లయ్య అనే సి.ఐ గతంలో విధి నిర్వహణలో భాగంగా శని, ఆదివారాల్లో అక్కడే ఉండేవారని, ప్రస్తుతం సస్పెండ్ అయిన తర్వాత పూర్తిగా అక్కడే ఉంటున్నారని ఆమె తెలిపారు. ఒక రోజు ఉదయం తన భర్త పని మీద బయటకు వెళ్లిన సమయంలో, నిందితుడు ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గదికి తాళం వేసి బలవంతం చేశారని, తాను ఎంత ప్రతిఘటించినా వదల్లేదని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడమే కాకుండా, తన కొడుకు ద్వారా తనకు బెదిరింపు సందేశాలు పంపిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఒక బాధ్యతాయుతమైన పోలీసు పదవిలో ఉండి ఇలాంటి అఘాయిత్యానికి ఒడిగట్టడం దారుణమని, తనకు న్యాయం జరగాలని, నిందితుడికి కఠిన శిక్ష పడాలని ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మరియు అధికారులను వేడుకున్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు, బ్యాంకులు మంచి చేయూతనందిస్తున్నాయి : ప్రత్తిపాటి

## డ్వాక్రా సంఘాలు ఆర్థిక ప్రగతి దేశానికే గర్వకారణం : ప్రత్తిపాటి

## చంద్రబాబు మానసపుత్రికలు డ్వాక్రా సంఘాల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు : ప్రత్తిపాటి

## డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే మొదటి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ యడ్లపాడులో ఏర్పాటు కావడం సంతోషకరం : ప్రత్తిపాటి

## కోటి 40లక్షల వ్యయంతో జిల్లాలో మొదటి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం జరిగింది : ఎంపీ లావు

## భవిష్యత్ లో ఈ తరహా యూనిట్ మండలానికి ఒకటి వచ్చేలా చూస్తాం : లావు






చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 30 : యడ్లపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థికాభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్నాయని, వారి ఆర్థికాభివృద్ధికి చేయూత నందిస్తున్నాయని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయల సహకారంతో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. యడ్లపాడు మండలం చెంగిజ్ ఖాన్ పేటలో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఎస్.బీ.ఐ ఆర్థిక సహకారంతో ఏర్పాటు కానున్న మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు మానసపుత్రికలు దేశానికే గర్వకారణంగా నిలిచాయి. : ప్రత్తిపాటి.

చంద్రబాబు మానసపుత్రికలైన డ్వాక్రా సంఘాలు నేడు దేశానికే గర్వకారణంగా నిలిచాయని, అంచెలంచెలుగా తమ ఆర్థిక ఉన్నతికి వారు చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం బ్యాంకులు రుణాలు అందించడంలో ఉదారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నేడు యడ్లపాడు మండలంలో తొలి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. దీంతో పాటు కట్టుబడివారిపాలెం, బుక్కాపురం, చిలకలూరిపేట పట్టణంలో కూడా ఈ తరహా యూనిట్స్ ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. మునగాకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో మునగ రైతులకు ఆర్థికంగా లాభం కలుగుతుందన్నారు. ఎకరాకు రూ.లక్షకు పైబడి ఆదాయం వస్తుందన్నారు. రైతులతో పాటు, డ్వాక్రా మహిళలకు ఉపయోగపడే ప్రాసెసింగ్ యూనిట్లను వీలైతే భవిష్యత్ లో గ్రామానికొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వాలతో పాటు బ్యాంకులు కూడా మహిళల ఆర్థిక ఉన్నతికి తమవంతు చేయూత నందిస్తున్నాయని, బ్యాంకు రుణాల చెల్లింపులో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం.. డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో మండలానికో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం : ఎంపీ లావు

మునగ ఆకుతో ఎనలేని ప్రయోజనాలు లభిస్తాయని, రూ. 1కోటి 40 లక్షలతో జిల్లాలో మొదటి మునగ ఆకు ప్రాసెసింగ్ యూనిట్ కు శంకుస్థాపన చేశామని, తొలి దశలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసి, అవి విజయవంతమైతే వాటి సంఖ్య మరింత పెంచుతామని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో పాటు.. డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో ఈ తరహా ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయడంతో పాటు, ఉత్పత్తుల తయారీ, విక్రయ నైపుణ్య శిక్షణను కూడా అందిస్తున్నామని ఎంపీ చెప్పారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులతో పాటు, ప్రాంతాలను బట్టి తయారయ్యే ఇతర ఉత్పత్తులు, వస్తువులకు కూడా తగిన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చిలకలూరిపేట పట్టణంలో ఫర్నీచర్ తయారీ, మార్కెటింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరినట్టు ఎంపీ చెప్పారు. అదేవిధంగా భవిష్యత్ లో జిల్లాలోని 28 మండలాల్లో ఈ తరహా యూనిట్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంలో భాగంగా త్వరలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రంలో ఏర్పాటైన యూనిట్లను పరిశీలించి, డ్వాక్రా సభ్యులతో మాట్లాడతారని లావు తెలిపారు. ఈ ప్రాంత మునగ రైతులు ఇకపై ఆకుని కూడా అమ్ముకొని లబ్ధి పొందవచ్చన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మదన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరరావు, కందిమల్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, పోపూరి వెంకయ్య, తులావ మాణిక్యాలరావు, యినాదుల భాస్కర్, దుర్గారావు, ఆంజనేయులు, వెంకట్రావు, డిఆర్డిఓ పిడి ఝాన్సీ రాణి, సిబిఐ ఆర్ఎం, యడ్లపాడు మండల ఎమ్మార్వో, ఎంపీడీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో 'కల్తీ' కోరలు: బ్రాండెడ్ లేబుళ్లతో ప్రాణాంతక వ్యాపారం!




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 30 : చిలకలూరిపేట : పట్టణం ప్రస్తుతం కల్తీ నూనె మాఫియా గుప్పిట్లో చిక్కుకుంది. అమాయక ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి కొందరు వ్యాపారులు కాసుల కక్కుర్తితో నకిలీ ఆయిల్ నెట్‌వర్క్‌ను నడుపుతున్నారు. విజిలెన్స్ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారుల కళ్లు గప్పి, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

బ్రాండెడ్ స్టిక్కర్ల వెనుక భయంకరమైన నిజం

కొందరు కేటుగాళ్లు ప్రముఖ ఆయిల్ కంపెనీల ఖాళీ డబ్బాలను, బ్రాండెడ్ లేబుళ్లను సేకరించి, వాటిలో నాణ్యత లేని, తక్కువ ధరకే లభించే ప్రమాదకరమైన ఆయిల్‌ను నింపుతున్నారు. ముఖ్యంగా చికెన్ మార్కెట్ మరియు పరిసర ప్రాంతాల్లోని కొన్ని దుకాణాల్లో ఈ తరహా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బ్రాండెడ్ ప్యాకింగ్ చూసి సామాన్య ప్రజలు అది అసలైన నూనె అని నమ్మి మోసపోతున్నారు.

నిద్రావస్థలో విజిలెన్స్ మరియు ఫుడ్ సేఫ్టీ విభాగం?

పట్టణంలో ఇంత బహిరంగంగా కల్తీ జరుగుతున్నా, విజిలెన్స్ అధికారులు కానీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం తనిఖీలు నిర్వహించకపోవడం వెనుక ఉన్న కారణాలేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కల్తీ మాఫియాకు వరంగా మారింది.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న 'ఆయిల్' గ్యాంగ్

కల్తీ నూనె వాడటం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికెన్ సెంటర్లు, హోటళ్లలో విరివిగా వాడుతున్న ఈ నూనె వల్ల చిలకలూరిపేట వాసుల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, ఆయిల్ గోడౌన్లపై దాడులు నిర్వహించి కల్తీ ముఠా గుట్టు రట్టు చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి...

## ప్రజలకు గొప్ప ఆరోగ్య రక్షణ నిధి: ప్రత్తిపాటి

### పలువురు అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ సాయం అందచేసిన ప్రత్తిపాటి.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 30 : చిలకలూరిపేట : ఆపదలో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలవారు ఎదుర్కొనే అనారోగ్య సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తగిన సాయం అందిస్తోందని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 23 మంది లబ్ధిదారులకు రూ.14.70 లక్షల విలువైన చెక్కుల్ని స్వయంగా అందచేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ప్రత్తిపాటి, ప్రభుత్వ పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు వారికి అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపత్కాలంలో ప్రజలకు అండగా నిలిచే, వారి ఆరోగ్యాన్ని రక్షించే గొప్ప నిధి అని, వారికి ఎంతగానో ఉపయోగపడే గొప్ప సాయమని ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామిరెడ్డి అభినందన సభలో పాల్గొన్న -- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..





నెల్లూరు పెన్ పవర్, ఏప్రిల్, 30:కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా సేవలందించిన కొంగలవీటి రామిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఘన అభినందన సభ నిర్వహించారు. కావలి పట్టణంలోని కలయిక కళ్యాణమండపంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమం అధికారులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఎంతో ఆనందోత్సాహాలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గారు హాజరై రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడుతూ, ఫారెస్ట్ శాఖలో రామిరెడ్డి అద్భుతంగా పనిచేసి మంచి పేరు సంపాదించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించి అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న రామిరెడ్డి, ఇకపై తన కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే సమాజ సేవలో కూడా చురుకుగా పాల్గొని తన అనుభవాన్ని ప్రజల మేలు కోసం వినియోగించాలని సూచించారు.

ఈ సందర్భంగా పలువురు అధికారులు, సహచరులు రామిరెడ్డితో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొని ఘనంగా సన్మానించారు...

# వేమూరి వెంకట ప్రసాద్ సేవలు ప్రశంసనీయంమీడియా సమన్వయంలో చురుకైన పాత్ర...డిఐపిఆర్వో కె.వి.రమణరావు.







విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 30, సమాచార, పౌర సంబంధాల శాఖలో 30 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ సేవలందించిన ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించడంతో పాటు మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంలో చురుకైన పాత్ర వహించి ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు మీడియా ప్రతినిధుల ప్రసంశలను అందుకున్న వేమూరి వెంకట ప్రసాద్ సమాచార శాఖకు అందించిన సేవలు ఆదర్శప్రాయంగా నిలుస్తాయని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.వి. రమణరావు అన్నారు. ఎవిసూపర్ వైజర్‌గా పనిచేస్తూ గురువారం పదవీ విరమణ చేసిన వి.వి.ప్రసాద్ దంపతులను ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో గల డీఐపీఆరవో కార్యాలయంలో అభినందన సభ నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి కె.వి. రమణరావు మాట్లాడుతూ 1995 సంవత్సరం సమాచార పౌర సంబంధాల శాఖ ఏలూరు కార్యాలయంలో సినీ అపరేటర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన వి.వి. ప్రసాద్ 1997 బదిలీపై విజయవాడ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో సమాచార శాఖ కీలకపాత్ర వహిస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో అత్యంత కీలకమైన సమాచార శాఖలో విధులు నిర్వర్తించడం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. 30 ఏళ్లకు పైగా విజయవాడలోని కార్యాలయాల్లో సమర్థవంతమైన అలుపెరగని సేవలందిస్తూ ప్రజా ప్రతినిధులు అధికారులు మీడియా ప్రతినిధుల మన్ననలను పొందరన్నారు. వి.వి.ప్రసాద్ ప్రతిభ నేటితరం ఉద్యోగులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాల్సిన అవసరముందన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వి.వి.ప్రసాద్ సేవలను గుర్తిస్తూ కృష్ణా ఎన్టిఆర్ జిల్లాలో పనిచేసిన కలెక్టర్ల నుండి ప్రసంశ పత్రాలను అభినందనలను అందుకున్నారన్నారు. విఐపిలు, వి.వి.ఐపిల పర్యటనలు, పుష్కరాలు, దసరా ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల సందర్భాలలో మీడియా ప్రతినిధులను సమన్వయ పరచుకోవడంలో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. పదవీ విరమణ ప్రతి ఒక్కరికి తప్పనప్పటికి వివి ప్రసాద్ సమాచార శాఖ నుండి పదవీ విరమణ పొందడం తీరని లోటని ఆయన సేవలను భవిష్యత్తులో సమాచార శాఖ వినియోగించుకుంటుందని అన్నారు. ఏపిఎన్‌జిజివో అసోసియేషన్ డి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అత్యంత కీలకమైన సమాచార శాఖలో నిజాయితీ కర్తవ్యనిష్టతో అమల్యమైన సేవలందించడంతో పాటు ఏపిఎన్‌జిజివో అసోసియేషన్ నాయకుడిగా ఉద్యోగ సమస్యలను పరిష్కరించడంలో నిబద్ధతతో పనిచేశారన్నారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా వివి ప్రసాద్ అందించిన సేవలు సంఘ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని ఆయన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి కిరణ్ కుమార్ ఎస్ సూర్యచంద్రరావు డిప్యూటీ డైరెక్టర్ రామాంజనేయులు,

తదితరులు వివి ప్రసాద్ దంపతులను అభినందించారు. సమాచార శాఖ సంయుక్త సంచాలకురాలు టి. కస్తూరి, ఆరఐఇ సి.వి. కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ తిమ్మప్ప, ఎం బాస్కరనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి. మోహన్‌రావు, ఏపిఎన్‌జిజివో జిల్లా కార్యదర్శి పి. రమేష్ నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. సివి.ఆర్ ప్రసాద్, షేక్ నజీర్‌హుద్దీన్ జిల్లా నగర శాఖల కార్యవర్గ సభ్యులు సమాచార శాఖ జోన్-2, కార్యాలయం సహాయ సంచాలకుల కార్యాలయం డిఐపిఆర్వో కార్యాలయం సిబ్బంది ప్రభుత్వ అతిథి గృహం ఆవరణంలోని వివిధ శాఖలకు చెందిన కార్యాలయల అధికారుల సిబ్బంది వి.వి. ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు...

# కోనాల అంబేద్కర్ మృతి పార్టీకి తీరని లోటు... కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...





పెన్ పవర్, ఏప్రిల్, 30: షెడ్యూల్ కులాల హక్కుల కోసం అవిశ్రాంతంగా శ్రమించిన కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం ఎస్సీ సెల్ అధ్యక్షులు కోనాల అంబేద్కర్ మృతి పార్టీకి తీరని లోటని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కోనాల అంబేద్కర్ మృతి చెందడంతో ఎమ్మెల్యే బండారు రావులపాలెం లోని ఆయన స్వగృహం వద్ద కోనాల అంబేద్కర్ పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి, పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కోనాల ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన మృతితో బలమైన నాయకుడ్ని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పది పరీక్షలలో విశ్వశాంతి విజయకేతనం.




భట్టిప్రోలు పెన్ పవర్, ఏప్రిల్, 30: మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 2026 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో టాప్ 3 ర్యాంకులను కైవసం చేసుకున్నారన్నారు. యడ్లపల్లి కుసుమ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పిల్లి తపస్వి 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందనితెలిపారు. మచ్చవరపు నాగ యక్షిత్ 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక బోధన మరియు క్రమశిక్షణే ఈ విజయానికి కారణమని వెంకట్రావు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల ఇంచార్జ్ వెంకటప్పయ్య, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి మరియు సిబ్బంది అభినందించారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణకు తాము ఇచ్చే ప్రాధాన్యత వల్లే ఇటువంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని వారు హర్షం వ్యక్తం చేశారు. హాజరైన 114 మంది లో 92 విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

# జర్నలిస్టులపై దాడులకు రెంటచింతలలో నిరసన ప్రదర్శన....

### తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకంకు వినతి పత్రాన్ని అందచేస్తున్న జర్నలిస్టు నేతలు, వివిధ పార్టీల నాయకులు..



రెంటచింతల పెన్ పవర్, ఏప్రిల్, 30: రాష్ట్రంలో ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న జర్నలిస్టులపై దాడులకు నిరసనగా గురువారం ఏపిడబ్ల్యూజే పిలుపు మేరకు మండల వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యం లో వివిధ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కె. రంగనాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనుచేసే జర్నలిస్టులపై దాడులు చేయడాన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. వికోటలో విధి నిర్వహణలో ఉన్న ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేయడం, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మరో రెండు ఛానల్స్ కు చెందిన రిపోర్టలపై తీవ్రంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కన్నెగంటి హనుమంత్ ఫౌండేషన్ అధక్షులు ఎన్. శ్రీనివాస రావు మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా వెలికితీసి ప్రజల్లోకి తీసుకువెళ్లే జర్నలిస్టులపై దాడులుచేయం, హత్యలు చేయడం దుర్మార్గ మన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారని తగిన రీతిలో శిక్షించాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ మేరికనకంకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజే నేతలు పూజల వెంకటరామయ్య, నారాయణం శ్రీనివాసమూర్తి, వెంకటేశ్వరరావు, పేరం చెన్నారెడ్డి, గుండా జనార్ధనావు, రమేష్ ఇబ్రహీం, కేథార్నాద్, ఎస్.కె షబ్బీర్, వెంకటరెడ్డి, సత్యం, పార్టీల నాయకులు సీహెచ్ అబ్బిరెడ్డి, జి. సుమంత్రెడ్డి, నాళం పెదబాబు, ఎం.రాజారెడ్డి, ఎం. రాజ్కుమార్, సిద్ధయ్య, బుట్టి మరిమదాను, అప్పయ్య, నేతాజీ, ఎం. చిన్న శౌరెడ్డి, కె. సైదులు ఎన్. శ్రీనివాసరావు, షేక్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు..

# పండ్ల మార్కెట్ లో రాజకీయాలకు తావులుండకూడదు.

### అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలపక్షానే ఉంటా.
### ప్రజా సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత.
### ఎన్నికలు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలమధ్యనే ఉంటాం.





నెల్లూరు పెన్ పవర్, ఏప్రిల్, 30: నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్, ఏ.సి. కూరగాయల మార్కెట్ లో 2 కోట్ల 92 లక్షల రూపాయలతో నిర్మించిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పండ్ల మార్కెట్ ను ప్రారంభించిన మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గత అనేక సంవత్సరాలుగా పరిష్కారానికీ నోచుకోని పండ్ల మార్కెట్ ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పండ్లమార్కెట్ ను నిర్మించాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పండ్ల మార్కెట్ సమస్య పరిష్కారం అయిన తరువాత పార్టీలకు అతీతంగా వారు నా పై చూపిన ప్రేమను ఎన్నడూ మర్చిపోలేను. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీలకు అతీతంగా పండ్ల మార్కెట్ వ్యాపారస్థులు వచ్చి నా పేరు పెడతామని పదేపదే నా పై ఒత్తిడి చేసిన తరువాత వారి ప్రేమాభిమానాలు చూసి అంగీకరించా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎక్కడ ఏ సమస్య ఉన్నా అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలపక్షాన నిలబడి పోరాటం చేసాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మెన్ రాపూరు చంద్రశేఖర్, డైరెక్టర్లు భీమతాటి సుధాకర్, శివ కుమార్, ముక్కం సాయి లక్ష్మణ్, తుళ్లూరు బాబు, గునుకుల విజయలక్ష్మి, కుప్పా ప్రసన్న, కుల్లూరు శైలజ, నెల్లూరు టౌన్ ఫ్రూట్స్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు , నెల్లూరు వెల్ఫేర్ ఫ్రూట్స్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

# టెన్త్ పాసైన తండ్రి జిల్లా బాబు, కూతురు చిట్టి తొలి ప్రయత్నంలో తండ్రి కూతురు టెన్త్ పాస్...



రెంటచింతల పెన్ పవర్, ఏప్రిల్, 30: పదవ తరగతి ఫలితాలు గురువారం విడుదలవ్వగా తండ్రి కూతురు తొలి ప్రయత్నంలో విజయం సాధించడం విశేషం. వివరాల్లోకెళ్తే మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన జిల్లా బాబు రావుతో పాటు కూతురు చిట్టి టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలు రాయగా ఇద్దర్ని విజయం వరించింది. సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో జిల్లా చిట్టి పరీక్షలు రాసి 448 మార్కులు సాధించింది. తండ్రి బాబురావు 24 ఏళ్ల క్రితం 9వ తరగతి వరకే చదివాడు. పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ వెల్డర్ గా పనిచేస్తున్న బాబురావు పది పూర్తి చేయాలనే లక్ష్యంతో ఓపెన్ స్కూల్ ద్వారా ఫీజు చెల్లించి 257 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. తండ్రి కూతురు ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ అందరికి స్వీట్లు పంచారు. చదువే ఉన్నతి కారణమనే భావన బాబురావుకు కలగడం హర్షించదగ్గ విషయం..

# ఎలక్ట్రానిక్ వస్తువులపై విద్యార్థులకు అవగాహన

రామచంద్రపురం . పెన్ పవర్, ఏప్రిల్, 30:జన విజ్ఞాన వేదిక(జెవివి) పట్టణశాఖ ఆధ్వర్యంలో రత్నంపేటలోని మునిసిపల్ హైస్కూ ల్‌లో జరుగుతున్న 'వేసవి వినోదం' కార్యక్రమంలో మంగళవారం ఎలక్ట్రానిక్ వస్తువులపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రీషియన్‌లు ఇవి.మోహన్, బి.శ్రీధరరావు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎయిర్ కండిషనర్‌లను విడదీసి అవగాహన కల్పించారు. వెంటూరు గ్రామంలో జడ్‌పి హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పి.హరిసూర్యనారాయణ 'ఒరి గామి'లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఆసక్తితో వివిధ వస్తువులను రంగు, రంగుల కాగితాలతో తయారు చేశారు.

# ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామిరెడ్డి అభినందన సభలో పాల్గొన్న -- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..

పెన్ పవర్ ప్రతినిధి కావలి కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా సేవలందించిన కొంగలవీటి రామిరెడ్డి ఉద్యోగవిరమణ సందర్భంగా ఘన అభినందన సభ నిర్వహించారు. కావలిపట్టణంలోని కలయిక కళ్యాణమండపంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమం అధికారులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఎంతో ఆనందోత్సాహాలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరై రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడుతూ, ఫారెస్ట్ శాఖలో రామిరెడ్డి అద్భుతంగా పనిచేసి మంచి పేరు సంపాదించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించి అందరికీ ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఉద్యోగ జీవితాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్న రామిరెడ్డి, ఇకపై తన కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అలాగే సమాజ సేవలో కూడా చురుకుగా పాల్గొని తన అనుభవాన్ని ప్రజల మేలు కోసం వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సహచరులు రామిరెడ్డితో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొని



ఘనంగా సన్మానించారు...

# ఆర్టీఈ సీట్లు జాప్యంపై సుప్రీం కోర్టు తీర్పు బాలల విజయం : గొండు సీతారాం

ఎంవిపి కాలనీ : పెన్ పవర్, ఏప్రిల్, 30:విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రభుత్వాలు సూచించిన విద్యార్థులకు స్థానిక ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు వెనుకబడ్డ 25 శాతం వర్గాల వారికి ప్రవేశాలు కల్పించడం జాతీయ కర్తవ్యమని, వారికి తక్షణమే సీట్లు కేటాయించాల్సిందేనంటూ సుప్రీం కోర్ట్ డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పు వెలువరించడం బాలల హక్కుల విజయమని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వం కేటాయించిన ఉచిత విద్యా నిర్బంధ హక్కు ద్వారా ప్రభుత్వం కేటాయించిన సీట్లు కల్పించేందుకు కొన్ని పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ అంశాలతో పాటు బాలల హక్కుల ఉల్లంఘనలు, ఉచిత విద్యా హక్కులను ఉల్లంఘన పద్ధతులను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఆధారాలతో సహా చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం తీసుకెళ్ళిందని ఆయన అన్నారు.

# దగదర్తిలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన.

## దగదర్తి మండలం అనంతవరంలో అభివృద్ధి పనుల పరిశీలన
## ఉపాధి హామీ పనులు, అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు
## గిరిజన కాలనీలో సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హిమాన్సు శుక్ల హామీ.

పెన్ పవర్ ప్రతినిధి కావలి నెల్లూరుజిల్లా దగదర్తి మండలం అనంతవరంలో జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల గురువారం పర్యటించారు. అధికారయంత్రాంగంతో కలిసి అనంతవరంలో జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు నేరుగా వెళ్లి తనిఖీలు చేశారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, ఎంత కూలీ డబ్బులు పడుతున్నాయని కలెక్టర్ వాకాబు చేసారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్టీల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును సందర్శించారు. పెండింగ్ లేకుండా అందరికీ ఆధార్ కార్డులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిదంగా గ్రామంలో నేచురల్ ఫార్మింగ్, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్, మామిడి తోటలను పరిశీలించి రైతుల అనుభవాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. అక్కడి నుంచి నేరుగా అంగన్వాడి కేంద్రానికి చేరుకుని తనిఖీలు చేశారు. చిన్నారులతో ముచ్చటించిన వారి అభ్యసన సామర్థ్యాలను స్వయంగా



తెలుసుకున్నారు. గిరిజన కాలనీలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుని పలు సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిలా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కావలి ఆర్డీవో ఎలీషా , మండల అధికారులు పాల్గొన్నారు.


# స్విమ్స్ కార్మికురాలిని పరామర్శించిన సిఐటియు నేతలు.



తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 30. స్విమ్స్ కార్మికుల పోరాటం కొనసాగుతున్న నేపథ్యంలో, దీక్షలో పాల్గొంటున్న కార్మికురాలు కుమారి విధుల్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురై గుండెపోటు లక్షణాలతో అదే ఆసుపత్రి వార్డులో చేరి చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఆమెకు యాంజియోగ్రామ్ నిర్వహించారు. గత 60 రోజులుగా మండుతున్న ఎండల్లో నిరంతర పోరాటంలో పాల్గొంటూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న కారణంగా ఆరోగ్యం దెబ్బతిన్నట్లు సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్, నగర అధ్యక్షులు పి. బుజ్జి, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి. రవి, మారి ముత్తు, వెంకటేష్, రుకేష్, వెంకటయ్య, ముని రాజమ్మ తదితరులు వార్డుకు వెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన చికిత్సను జాగ్రత్తగా అందించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ, “నెలల తరబడి పోరాటం చేస్తూ కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఒక మహిళా కార్మికురాలు ఇలా వార్డులో చేరే పరిస్థితి రావడం చాలా బాధాకరం.

ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి” అని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, కుమారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# గుడిమల్లం కలశాల మార్పిడి పై చారణ జరిపించాలి. --వైఎస్ఆర్సిపి నేత చిందేపల్లి మధుసూదన్








తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,ఏప్రిల్ 30, చారిత్రక నేపధ్యం ఉన్న గుడి మల్ల శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయ గోపుర కలశాల తొలగింపు పై రహస్యం దాగి ఉందని వైకాపా నేత చిందేపల్లి మధుసూదన్ రెడ్డి ధ్వజమెత్తారు. శతాబ్దాల కాలం చెక్కుచెదరకుండా ఉన్న కళాశాలలను ఎవరి అనుమతితో మార్చారని ఆయన ప్రశ్నించారు. గోపుర దర్శనం పుణ్యదాయకమని భక్తుల నమ్మకం అలాంటిది పారదర్శకత లేకుండా ఈ పనులు చేయడం వెనుక ఏదైనా అక్రమం ఉందా, అని ఆయన నిలదీశారు. అధికారులు వెంటనే స్పందించి పాత కలశాల ఆచూకిని బయటపెట్టి భక్తుల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

# 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో విశ్వభారతి హైస్కూల్ విద్యార్థుల విజయభేరి...



నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 30 రాష్ట్రవ్యాప్తంగా గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయభేరి మ్రోగించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజనేని గోపాల్ నాయుడు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాల వివరాలను తెలియజేశారు. ఎ. ప్రణీత 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే కె. లిషిత 590మార్కులు ,జి. కావ్య 590 మార్కులు,ఎ హేమన్విత 587 మార్కులు,ఎస్ చార్విక 583 మార్కులు, కె ధనుశ్రీ 581 మార్కులు సాధించాలని తెలియజేశారు. పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు వ్రాసిన 54 మంది విద్యార్థుల్లో 27 మంది విద్యార్థులు 500 ఒక పైగా మార్కులు సాధించారని అన్నారు. 34 ఏళ్లుగా విశ్వ భారతీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలియజేశారు. గత నాలుగేళ్లుగా తమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల్లో సగాటికి పైగా 500 పైబడి మార్కులు సాధిస్తున్నారని అన్నారు. తమ పాఠశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు నేడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి నేటి విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉన్నారన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి,విద్యార్థులను ప్రోత్సహించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక సిబ్బందికి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్వకేంద్ర విద్యార్థుల ప్రభంజనం...



నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 30 రాష్ట్రవ్యాప్తంగా గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని విద్వకేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా విధ్వకేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ పి శ్రీనివాసులు రెడ్డి,ప్రిన్సిపాల్ డి రామిరెడ్డి అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించి,అభినందించారు. అనంతరం వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సాధించిన పదో తరగతి పరీక్ష ఫలితాల వివరాలను తెలియజేశారు. ఎస్ శ్రీనిధి 595 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించడంతోపాటు టౌన్ ఫస్ట్ లో నిలిచారని తెలిపారు. ఎస్ డి సుహాన ఫరహీన 593మార్కులతో స్టేట్ ర్యాంక్ తో పాటు టౌన్ థర్డ్ స్థానంలో నిలిచారనితెలిపారు. పి సూర్య 591 మార్కులతో స్టేట్ ర్యాంక్ తో పాటు టౌన్ ఫిఫ్త్ ర్యాంకు సాధించాలని తెలియజేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 50 శాతం మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించినట్లు తెలియజేశారు. పాఠశాల స్థాపించిన 14 సంవత్సరాల నుండి తమ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధిస్తూ రికార్డు సృష్టిస్తున్నారని తెలియజేశారు. తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయ సిబ్బందికి, విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# పెళ్లకూరు మండలంలో ఎస్ఎస్సి ఫలితాల హవా!










పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 30 మండల పరిధిలోని మొత్తం 206 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 165 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు, అనగా 80.09% , జెండర్ వారీగా బాలురు 74/101 బాలికలు 91/105 మండలంలో 589 మార్కుల తో ఎస్ తనూష , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంబెడు ప్రథమ స్థానాన్ని సాధించారు. మండలంలో ద్వితీయ స్థానాన్ని సాధించిన జడ శ్రావ్య , జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ,పాలచ్చూరు అలాగే తృతీయ స్థానాన్ని ఎం. సుజిని , గవర్నమెంట్ ఉన్నత పాఠశాల పెళ్లకూరు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులు దిగులు చెందక , ధైర్యంగా ఉండి, త్వరలో జరగబోయే పరీక్షలకు బాగా ప్రిపేర్ అయి, చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని తెలియజేశారు.

# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం,






బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 30. శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా బ్రహ్మోత్సవాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన దేవస్థాన అధికారులు దేవస్థానంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గౌరవ కోవూరు శాసన సభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ మొగిలి వెంకటేశ్వర్లు జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ ఎన్ విజయ్ కుమార్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా అజితా వేజెండ్ల ఐ పి ఎస్ అధికారులను దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాలు మే 7 నుండి మే 17 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్త మండలి సభ్యులు స్వయంగా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసి, ఉత్సవాలలో పాల్గొని స్వామివారి/అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందవలసిందిగా కోరారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, వాహన సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రధాన వాహన సేవల రోజుల్లో భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం, ప్రసాద పంపిణీ, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, విశ్రాంతి మండపాలు వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, దారి సూచికలు, వాలంటీర్ల సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భద్రతా దృష్ట్యా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్, అత్యవసర సేవలు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి, జిల్లా పోలీస్ అధికారులు బ్రహ్మోత్సవాలకు విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని దేవస్థానం తరఫున వినయపూర్వకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, కార్యనిర్వహణాధికారి, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు

# అక్కా చెల్లెళ్లకు ఒకే మార్కులు



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 30. బుచ్చిరెడ్డిపాలెం లోని కోనేటి మిట్టకు చెందిన అక్కాచెల్లెళ్లు చదువులో రాణిస్తున్నారు స్థానికంగా నివాసం ఉంటున్న వి వెంకటేశ్వర్లు వరలక్ష్మి దంపతులకు సిగ్నశ్రీ. సంజన సంతానం. ఇద్దరికీ గత ఏడాది తేడా. తండ్రి ఓ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి గృహిణి. ప్రభుత్వ పాఠశాలలో చదివిన సిగ్నశ్రీ కి గత ఏడాది 591 మార్కులు సాధించింది. ఇవాళ విడుదలైన ఫలితాల్లో చెల్లి సంజనా కూడా 591 మార్కులు సాధించింది అందరిని అబ్బురపరిచింది

# సీఎంఆర్ఎఫ్‌తో పేద ప్రజలకు ఆరోగ్య రక్ష





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 30.ఒకే రోజు 68 మందికి 69 లక్షలు అందజేత అర్హులకు చెక్కులు అందజేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సీఎంఆర్‌ఎఫ్ నిధులతో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని విపిఆర్ క్యాంపు కార్యాలయంలో 68 మంది లబ్ధిదారులకు 69 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఇందులో ఎంపీ పరిధిలో 7 మందికి 5 లక్షలు, ఎమ్మెల్యే పరిధిలో 61 మందికి 64 లక్షలు అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే పరిధిలో ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల విలువైన చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయల సీఎంఆర్‌ఎఫ్ నిధులు ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చంద్రబాబు నాయుడు లాంటి మానవతావాది ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. పేద కుటుంబాలలో ఎవరికైనా పెద్ద జబ్బు చేసి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతే నేనున్నానంటూ సీఎంఆర్‌ఎఫ్ ఆదుకుంటున్నారని చెప్పారు. 23 నెలల కాలంలోనే కోవూరు నియోజకవర్గంలో 804 మంది బాధితులకు 8.47 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందచేశామన్నారు. పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియచేసారు.

# సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం

## నెల్లూరు జిల్లాలో జరగనున్న మహానాడును విజయవంతం చేయండి..
## త్వరలోనే కొత్త పెన్షన్లు, ఇళ్ల పట్టాలు.
## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.





కోవూరు పెన్ పవర్ ఏప్రిల్ 30. కొడవలూరు మండలంలోని తాటాకుల దిన్నె గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గత 30 ఏళ్లుగా స్మశానానికి సరైన దారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 5 లక్షల ఎంపీ లార్డ్స్ నిధులతో స్మశాన వాటికకు వెళ్లే రహదారిని నిర్మించినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే ఈ మార్గాన్ని పూర్తిస్థాయి సిసి రోడ్డుగా మారుస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు. స్మశానానికి దారి కోసం స్థలాన్ని కేటాయించిన స్థల దాత ఉయ్యాల దేశయ్యను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీ ప్రజల విన్నపాన్ని మన్నిస్తూ త్వరలోనే అక్కడ వాటర్ ట్యాంక్ మంజూరు చేయిస్తామని గ్రామంలో అవసరమైన మరిన్ని రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల



ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెబుతూ.. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఆమె కొనియాడారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో పాటు, మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రజలకు వివరించారు. అర్హులైన వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండలం తెలుగుదేశం, జనసేన, బిజెపి ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం భూములపై పారదర్శకంగా వ్యవహరించండి

ఎంవిపి.కాలనీ :పెన్ పవర్, ఏప్రిల్ 30, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో రిలయన్స్ సంస్థకు కేటాయించిన విలువైన ప్రభుత్వ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు గురువారం వెల్లడించారు. 2008లో అప్పటి ప్రభుత్వం రిలయన్స్ పవర్‌కు చెందిన కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్ (సిఏపిఎల్)కు 4000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు కోసం 2,750 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు అమలు కాలేదని పేర్కొన్నారు. దాదాపు 18 ఏళ్లుగా భూమిని వినియోగించకుండా ఉంచి, అదే భూమిని తాకట్టు పెట్టి బ్యాంకుల నుంచి భారీ రుణాలు తీసుకున్నట్లు ఆయన లేఖలో విమర్శించారు. ప్రస్తుతం ఆ భూముల విలువ సుమారు రూ.12 వేల కోట్లకుపైగా ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం బిఒఎస్ -- 24 నిబంధనల ప్రకారం సంవత్సరానికి కనీసం 10 శాతం రెంటు, అదనంగా జరిమానా వసూలు చేయాలని సూచించారు.

# సోషల్ మీడియా మాయలో పడి చదువులు పాడు చేసుకోవద్దు





నెల్లూరు పెన్ పవన్ ఏప్రిల్ 30. ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు విపిఆర్ ఫౌండేషన్ ప్రోత్సాహం. అపజయాలకు కుంగిపోవద్దు.. ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగండి. అమ్మకు చెప్పలేని పని ఏదీ చేయొద్దనే నారా లోకేష్ గారి మాటను ఆదర్శంగా తీసుకోండి లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించండి 10 తరగతిలో 594 సాధించిన విపిఆర్ స్కూల్ విద్యార్థిని సిహెచ్ మానసకు అభినందనలు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నెల్లూరులోని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మెడల్స్ ప్రధానం చేసి వారిని ప్రోత్సాహించారు. ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారు ఏమాత్రం బాధపడకూడదని మార్కులు మాత్రమే ప్రతిభకు కొలమానం కాదని స్పష్టం చేశారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువత సోషల్ మీడియాకు బానిసలు కాకూడదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హితవు పలికారు. కొత్త విషయాలు నేర్చుకోవడానికి సాంకేతికతను వాడుకోవాలే తప్ప అది చదువుకు ఆటంకం కాకూడదని సూచించారు.ఐటి మంత్రి నారా లోకేష్ తరచూ చెప్పే అమ్మకు చెప్పకూడని పని ఏదీ చేయకూడదు అనే మాటను ఆదర్శంగా తీసుకోవాలని ఆమె విద్యార్థులకు



పిలుపునిచ్చారు. తప్పులు చేయడం సహజమని వాటిని సరిదిద్దుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అపజయాల నుంచి గుణపాఠాలు నేర్చుకుని విజయం వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ సందర్భంగా 10 తరగతిలో 594 సాధించిన విపిఆర్ స్కూల్ విద్యార్థిని సిహెచ్ మానసకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందనలు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తిరిగి ఇక్కడే ఉద్యోగాలు పొందేలా కోవూరు నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని ఆమె భరోసా ఇచ్చారు.ఎవరి జీవితాలకు వారే దిశా నిర్దేశం చేసుకుంటూ ఏది మంచి ఏది చెడు అనేది విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తల్లితండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు మరియు లెక్చరర్లు ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.






# పది పరీక్షల్లో బుచ్చి బాలికల పాఠశాల విద్యార్థినిలు హవా..



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 30. 591, 590 మార్పులతో మండల మొదటి రెండు స్థానాలు కైవసం.. 500 కు పైగా మార్పులు సాధించిన 40 మంది విద్యార్థినిలు. పది పరీక్షా ఫలితాల్లో బుచ్చి బెజవాడ బుజ్జమ్మ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుచ్చికి చెందిన వి. సంజన 591 మార్కులు సాధించి మండల టాపర్‌గా, 590 మార్కులతో మరో విద్యార్థిని ద్వితీయ స్థానంలో నిలిచారు. పాఠశాలలో మొత్తం 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం సుజాత తెలిపారు.

# పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం.. జూన్ నెల నుంచి ఇక దబిడి దిబిడే

**పెన్ పవర్ డెస్క్:**జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే జిల్లాల పర్యటనలు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత ఆయన జిల్లాల పర్యటన ఉంటుందని తెలిసింది. ప్రస్తుతం పది రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో పవన్ కల్యాణ్ రెస్ట్ లో ఉన్నారు. మే రెండో వారంలో ఆయన తిరిగి పాలనలో బిజీ అవుతారు. ఇక జూన్ నెల నుంచి జిల్లాల పర్యటనలు ప్రారంభమవుతాయని అంటున్నారు. అప్పటికి వేసవి తీవ్రత తగ్గడంతో పాటు ఆరోగ్యపరంగా ఫిట్ అవుతామని భావించి జూన్ నెలలో అన్ని జిల్లాలను పర్యటించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారని సమాచారం.

**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో...**

ఇందుకోసం పార్టీ కీలక నేతలకు పవన్ కల్యాణ్ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతుండటంతో తాను వెళ్లి జనసేన నేతల్లోనూ, కార్యకర్తల మధ్య సమన్వయం కుదిర్చే పనిని చేపట్టాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. అనేక నియోజకవర్గాల్లో జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడాన్ని పవన్ కల్యాణ్ గుర్తించారు. అయితే ఇప్పటి వరకూ ఒక లెఖ్క. ఇకపై మరొక లెఖ్క. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమితో పాటు జనసేన కూడా విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడే రానున్న సాధారణ ఎన్నికల్లో గెలుపు సులువుగా మారుతుందన్న అంచనాలున్నాయి.

**సమన్వయ కమిటీ సమావేశంలో...**

అందుకే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనల్లో ముఖ్య నేతలతో పాటు, కార్యకర్తలతో కూడా సమావేశమవుతారని తెలిసింది. దీంతో పాటు ఆ నియోజకవర్గాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గుర్తించి దానిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. మరొకవైపు టీడీపీ, జనసేన, బీజేపీలతో కూడిన సమన్వయ కమిటీ సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ చంద్రబాబును కోరనున్నట్లు తెలిసింది. తాను జిల్లాల పర్యటనల్లో గుర్తించిన సమస్యలను సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించి వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద జూన్ నెల నుంచి ఇక జనసేన ను యాక్టివ్ చేయాలని పవన్ కల్యాణ్ యోచిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సొంత నియోజకవర్గాలపై దృష్టి

**విజయవాడ, ఏప్రిల్ 30 పెన్ పవర్:** ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎమ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

## సొంత ఇమేజ్ పై దివ్యదృష్టి...

**కాకినాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:** రాజకీయాల్లో వారసత్వాలకు కొదవలేదు. అది పురుషులైనా మహిళలైనా ఇటీవల కాలంలో రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పొలిటికల్ కెరీర్ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గం ఎమ్మెల్యే కీలకమని చెప్పాలి. గత ఎన్నికల్లో తుని నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి సీనియర్ మోస్ట్ నాయకుడు యనమల రామకృష్ణుడి కుమార్తె యనమల దివ్య పోటీ చేశారు.. విజయం కూడా దక్కించుకున్నారు. నిజానికి వైసీపీ ఇక్కడ బలంగా ఉంది. స్థానికంగా కూడా వివాదరహితంగా వైసిపి గత ఎన్నికల సమయంలో వ్యవహరించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ తునిలో వైసీపీ విజయం సాధిస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ దీనికి భిన్నంగా తుని పొలిటికల్ తెరపై తొలిసారి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య విజయం సాధించారు. పైగా ఆ సమయంలో సొంత కుటుంబంలోనే రెండు వర్గాలుగా ఏర్పడిన పరిస్థితి ఉంది, యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టిడిపి ఓటు బ్యాంకు చీల్చే ప్రయత్నం చేశారని పెద్ద ఎత్తున చర్చ కూడా సాగింది. యనమల దివ్య ఘన విజయం దక్కించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పుడు రెండు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత మరి ఆమె పరిస్థితి ఏ విధంగా ఉంది.. నియోజకవర్గం అభివృద్ధి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు ప్రజలకు అందుతున్న లబ్ధి వంటివి ఏ మేరకు దివ్యకు పేరు తీసుకు వస్తున్నాయి.. అనేది చూస్తే సానుకూల పరిణామాలే కనిపిస్తున్నాయని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.గత ఎన్నికల వరకు యనమల రామకృష్ణుడి పేరుతోనూ యనమల కుటుంబం పేరుతో రాజకీయాలు చేసిన దివ్య ఇప్పుడు సొంతంగానే తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి తోడు వైసిపి తరఫున కార్యక్రమాలు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనిపించని పరిస్థితి ఉంది. ఇది దివ్యకు మరింతగా కలిసి వచ్చింది. వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతురాలు అయిన దివ్య సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అధికారులను ముందుకు నడిపించే విషయంలోనూ చాలా విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ఆమె వేస్తున్న అడుగులు మంచి ఫలితాన్ని అందిస్తున్నాయి. ఎక్కడ ఎమ్మెల్యే పై వ్యతిరేకత కనిపించడం లేదు. సొంత పార్టీలోనూ కలివిడితనం స్పష్టంగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో ఎమ్మెల్యే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలి. నియోజకవర్గంలో అభివృద్ధి విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ వ్యక్తిగత అంశాల విషయంలో కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞాపనలను కూడా ఆమె పరిశీలనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వరుసగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు అందిన ఎమ్మెల్యేల రిపోర్టులో దివ్య తొలి 100 స్థానాల్లోనే ఉండడం విశేషం.

## కొంప ముంచుతున్న కృత్రిమ కొరత

**కాకినాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. విపక్షసీపీఆయకులునిపై నిరసనలు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏపీలో ఈ పరిస్థితి నెలకొందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి కొరత లేదని కూటమి అధికారంలో ఉన్న ఏపీలో మాత్రం ప్రజలకు పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యకు ప్రధాన కారణాలు పానిక్ కొనుగోళ్లు, సరఫరా ఆలస్యాలు, పరిశ్రమల డిమాండ్ మార్పులు అని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4,500కి పైగా పెట్రోల్ బంకుల్లో 10--70 శాతం మూతపడ్డాయి. కర్నూలు, నంద్యాల్, గోదావరి, విశాఖలో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. రోజువారీ 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9 వేల కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలకు 50 శాతం అధిక డిమాండ్ ఏర్పడటంతో సంక్షోభం తీవ్రమైంది. దొరకదనే కారణంతో చాలా మంది అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు.పానిక్ భయంతో అనవసర కొనుగోళ్లు పెరగడం కొరతకు ప్రధాన కారణం. సాధారణ అమ్మకాలకు రెట్టింపు డిమాండ్ వచ్చింది. పారిశ్రామికులు అధిక ధరల కారణంగా రిటైల్ డీజిల్‌కు మారారు, వ్యవసాయ రంగంలో కూడా డిమాండ్ పెరిగింది. యుద్ధాలు, ఆయిల్ కంపెనీల రెండు రోజుల ఆలస్య సరఫరా, క్రెడిట్‌కు బదులు క్యాష్ డిమాండ్ కృత్రిమ కొరతను మరింత పెంచాయి.సీఎం చంద్రబాబు పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. అధిక సరఫరా కోరారు. . మంత్రి నాదెండ్ల మనోహర్ కొరత లేదని, పోయేకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు సంస్థల సరఫరా ఆగిపోవడంపై కూడా చర్చించారు.పానిక్ కొనుగోళ్లు తగ్గిస్తే సమస్య త్వరగా సద్దుమణుగుతుంది. ఆయిల్ కంపెనీలు సరఫరాను మెరుగుపరచాలి, పరిశ్రమలకు ప్రత్యేక సరఫరా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం డీలర్లను పరిగణనలోకి తీసుకుని, పారదర్శకత పెంచాలి.

# ఏపీకి 11,056 కోట్లు..

**ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..**

**విజయవాడ, ఏప్రిల్ 30 పెన్ పవర్:**

ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు. కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు"ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి.. ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతున్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా



కనిపిస్తున్నాయని" భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

**గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ**

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపె,,లకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు.

ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# మావిగన్ తో జగన్ కు బంపర్ మైలేజ్



**విజయవాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:**

వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్థి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీ పడలేని స్థితిలోనే ఉంటుంది. అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటి వెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదట షాక్ అయింది ఆ మీదట హీటెక్కిపోయింది. ఇక మావిగన్ అన్నది ట్రెండింగ్ లో ఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది. ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటున్నారు. ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతా అంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది. ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగా చర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనే వైసీపీ బహుళ ప్రచారం పొందింది. నిజం చెప్పాలంటే ఈ సమయంలో అంటే వైసీపీ భారీ ఓటమిని అందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళ వచ్చిన ఈ బూస్టింగ్ కానీ జరిగిన ప్రచారం కానీ రూపాయలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియానా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ప్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్థించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. అంటే ఇంతలా ఇది ప్రచారం అవుతుందని బహుశా వైసీపీ కూడా ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

# టీమిండియా కెప్టెన్ గా రిషభ్ పంత్.. పడిక్కల్, నబీలకు బెస్ట్ ఛాన్స్!







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ముగిసిన వెంటనే వారం రోజుల గ్యాప్ లో టీమిండియాతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఒక టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. జూన్ 6 నుంచి 10 వరకు ఈ టెస్ట్ మ్యాచ్ జరగనుంది. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆఫ్ఘన్ తో భారత క్రికెట్ జట్టు రెడ్ బాల్ క్రికెట్ ఆడుతుండడం విశేషం. ఎలాగో టెస్ట్ ఛాంపియన్ షిప్ లో ఆఫ్ఘనిస్తాన్ భాగం కాకపోవడంతో ఈ టెస్టులో సీనియర్స్ ను రెస్ట్ లభించడం ఖాయంగా కనిపిస్తుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రాలతో కొంత మంది స్టార్ ప్లేయర్స్ కి రెస్ట్ ఇవ్వాలని సెలెక్టర్లు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాలు కూడా ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడకపోవచ్చు. గిల్ రెస్ట్ తీసుకోవడంతో వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ ముగింపుకూ, ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే ఏకైక టెస్టు ఆరంభానికి మధ్య చాలా తక్కువ సమయం ఉంది. ఆటగాళు అలసిపోకుండా వారి పని భారాన్ని దృష్టిలో పెట్టుకొని సెలెక్టర్లు, జట్టు యాజమాన్యం జాగ్రత్త తీసుకుంటున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే మన జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. 2027లో వన్డేవరల్డ్ కప్ ఉండడంతో ఈ మూడు వన్డేల సిరీస్ కు పూర్తిస్థాయి భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆఫ్ఘనిస్తాన్ తో జరగబోయే ఏకైక టెస్టుకు సీనియర్స్ కు రెస్ట్ ఇస్తే వన్డే సిరీస్ కు రెండు వారాల విరామం లభిస్తుంది. అప్పుడు వర్క్ లోడ్ లేకుండా వన్డే సిరీస్ లో ప్లేయర్స్ ఆడతారు. ఏదైనా ఐపీఎల్ ముగిసేలోపు అధికార ప్రకటన రానుంది.

స్టార్ ప్లేయర్స్ రెస్ట్ తీసుకోవడంతో ఇప్పుడు దేశవాళీ క్రికెట్ లో బాగా రాణించిన వారికి ఈ టెస్ట్ మ్యాచ్ లో ఛాన్స్ లభిస్తుంది. డొమెస్టిక్ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న దేవ్ దత్ పడికల్ తో పాటు గత రంజీ ట్రోఫీలో 10 మ్యాచ్ ల్లోనే 60 వికెట్లు పడగొట్టిన ఔకిబ్ నబీకి ఛాన్స్ దక్కనుంది. వీరిద్దరిపైనే అందరి దృష్టి నెలకొంది. సెలెక్టర్లను ఆకట్టుకున్న వారిలో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్, స్పిన్నర్ మానవ్ సుతార్ కూడా ఉన్నారు. ఐపీఎల్ ఫైనల్‌కు, ఆఫ్ఘనిస్తాన్ టెస్టుకు మధ్య పెద్దగా విరామం లేదు. కాబట్టి ఆటగాళ్లు అలసిపోకుండా సెలెక్టర్లు, యాజమాన్యం జాగ్రత్త పడతారు. ఎందుకంటే టెస్ట్ తర్వాత ఆఫ్ఘనిస్థాన్ తో మూడు వన్డేలు, ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో వైట్-బాల్ సిరీస్ ఉన్నాయి. శుభ్‌మన్ గిల్ స్థానంలో మిడిల్ ఆర్డర్ లో పడికల్ ఆడనున్నాడు. జడేజా, కుల్దీప్ కు రెస్ట్ ఇస్తే ఆ స్థానంలో మానవ్ సుతార్ కు అవకాశం దక్కొచ్చు. బుమ్రా ప్లేస్ లో ఆకిబ్ నబీ జట్టులోకి రానున్నాడు. ఓపెనర్ రాహుల్ స్థానంలో సాయి సుదర్శన్ జట్టులోకి రావొచ్చు. యంగ్ స్టార్స్ కు అవకాశమిస్తే రానున్న ఏడాదిలో టీమిండియా కీలక టెస్ట్ సిరీస్ లలో వీరికి అవకాశం దక్కనుంది. వీటిలో ప్రధానంగా న్యూజిలాండ్ లో రెండు టెస్టులతో పాటు ఆస్ట్రేలియాతో 5 టెస్ట్ మ్యాచ్ ల బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ ఆడాల్సి ఉంటుంది. 2027 ఎండింగ్ లో వరల్డ్ కప్.. అదే ఏడాది జూన్ లో టెస్ట్ ఛాంపియన్ షిప్ ఉండడంతో భారత్ ఈ రెండు ఫార్మాట్ల పైనే ఎక్కువగా దృష్టి పెట్టనుంది.

# ఆర్సీబీపై రివేంజ్ తీర్చుకున్న టైటాన్స్.. ఘోరంగా ఓడిన బెంగళూరు

ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి, 5 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీని నమోదు చేసింది. ఈ విజయంతో టైటాన్స్ పాయింట్ల పట్టికలో ఓ అడుగు ముందుకు వేసింది.







**గిల్ మెరుపు ఇన్నింగ్స్:**

లక్ష్య ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. 42 పరుగుల వద్ద సాయి సుదర్శన్ (6) భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో అవుట్ అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (18 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆర్సీబీ బౌలర్లను ఒక ఆటాడుకున్నాడు. హాఫ్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో భువీ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. అనంతరం జోస్ బట్లర్ (19 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) తనదైన శైలిలో సిక్సర్లతో విరుచుకుపడి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. మధ్యలో షారుఖ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్ (11) తక్కువ స్కోరుకే అవుట్ అయి ఉత్కంఠ రేపినప్పటికీ, చివర్లో రాహుల్ తెవాటియా భారీ షాట్లతో ఫినిషింగ్ టచ్ ఇచ్చి జట్టుకు విజయాన్ని అందించాడు.

**భువీ పోరాటం వృథా:**

ఆర్సీబీ బౌలర్లలో వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ (3 వికెట్లు) అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. రొమారియో షెపర్డ్ రెండు వికెట్లు తీయగా, సుయాష్ శర్మకు ఒక వికెట్ దక్కింది. అయితే స్వల్ప స్కోరు కావడంతో బెంగళూరు బౌలర్లు ఓటమిని అడ్డుకోలేకపోయారు. కేవలం 15.5 ఓవర్లలోనే మ్యాచ్ ని ఖతం చేసేసింది గుజరాత్.

# "బర్త్ డే భాయ్" రోహిత్ శర్మ ట్రాక్ రికార్డ్.. కోహ్లీ, సచిన్ వల్ల కూడా కాలేదుగా







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్లేయర్స్ లలో ఒకరైన హిట్ మ్యాన్, రోహిత్ శర్మ నేడు తన 39వ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకుంటున్నాడు. స్టేడియంలో పరుగుల వరద పారించడమే కాదు, కెప్టెన్‌గా టీమిండియాకు ప్రపంచ కప్‌లను అందించిన ఈ 'హిట్‌మ్యాన్' పేరిట కొన్ని అద్భుతమైన రికార్డులు కూడా ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో వాటిని అధిగమించడం ఇప్పటి వరకు ఏ బ్యాటర్‌కైనా అంత సులభం కాదు. అవేంటో ఇప్పుడు ఒకసారి చూద్దాం..

డబుల్ సెంచరీల కింగ్: వన్డేల్లో ఒక్క డబుల్ సెంచరీ కొట్టడమే గగనమైన వేళ, రోహిత్ శర్మ ఏకంగా మూడుసార్లు ఈ రికార్డుని సాధించి చరిత్రలోకి ఎకెక్కాడు. ఆస్ట్రేలియాపై ఒకసారి, శ్రీలంకపై రెండుసార్లు డబుల్ సెంచరీలు కొట్టి 'డబుల్ సెంచరీల కింగ్' అని పిలుపించుకున్నాడు. వరల్డ్ లో మరే ఇతర బ్యాటర్ కూడా ఇప్పటి వరకు ఈ స్థాయికి చేరుకునేందుకు ప్రయత్నం కూడా చేయలేకపోయాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక సెంచరీలు: ప్రపంచ కప్ లాంటి భారీ టోర్నీలలో రోహిత్ శర్మ ప్రదర్శన అమోఘం.. వన్డే వరల్డ్ కప్ చరిత్రలో అత్యధికంగా 7 సెంచరీలు కొట్టిన రికార్డు అతడి పేరుపైనే ఉంది. ఈ క్రమంలో ఆయన సాక్షాత్తు సచిన్ టెండూల్కర్ ఘనతని కూడా అధిగమించాడు. ముఖ్యంగా 2019 వరల్డ్ కప్‌లో ఒకే టోర్నీలో 5 శతకాలు సాధించి రికార్డు సృష్టించాడు.వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు: క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ గుర్తు పెట్టుకునే రికార్డు రోహిత్ శర్మ పేరుపైనే ఉంది. 2014లో కోల్‌కతా వేదికగా శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఏకంగా 264 రన్స్ సాధించి వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఒక ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు, 9 సిక్సర్లతో విరుచుకుపడి.. ఈ మైలురాయిని చేరుకోవడం ప్రస్తుత తరం ప్లేయర్స్ కి ఒక కలగానే మిగిలిపోయింది.

ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సిక్సర్ల రారాజు: సిక్సర్లు బాదడంలో రోహిత్ శర్మకు సాటి ఎవరూ రాలేదు.. క్రికెట్ 3 ఫార్మాట్లలో కలిపి మొత్తం 650కి పైగా సిక్సర్లు బాది వరల్డ్ లోనే అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరుపై ఉన్న ఘనతని తుడిచి పెట్టిన హిట్ మ్యాన్, తన అద్భుతమైన టైమింగ్‌తో 'సిక్స్ మెషీన్'గా గుర్తింపు తెచ్చుకున్నాడు.

# హీరోలే డూప్‌లు వాడేస్తుంటే ఇంత సాహసం ఎందుకు?



కృతి శెట్టి ఎలిగెంట్ ఎత్నిక్ గ్లామ్‌లో మెరిసింది

గత కొంత కాలంగా స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలకు హై రిస్క్ ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం బాడీ డబుల్‌ని వాడేస్తున్నారని, సాహసాలు చేయడానికి ఇష్టపడటం లేదని, అయితే ఈ విషయాన్ని హీరోలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని నటుడు, డైరెక్టర్ రవిబాబు ఇటీవల ఓ బాంబ్ పేల్చిన విషయం తెలిసిందే. హీరోలు ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది పలు క్రేజీ సినిమాల్లో నటించి టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలిచిన రష్మిక ప్రస్తుతం భర్త విజయ్ దేవరకొండతో కలిసి -రణబాలి-లో నటిస్తూనే ఓ పవర్ ఫుల్ స్టోరీతో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా -మైసా-లో నటిస్తోంది. దీనికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక ఈ సినిమా కోసం ఎంత రిస్క్ చేయడానికైనా వెనుకాడటం లేదు. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేని విధంగా రష్మిక మందన్న ఓ సాహసం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

యదార్ధ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం గోండు తెగకు చెందిన యువతిగా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ సినిమా కోసం రష్మిక తాజాగా పెద్ద రిస్కే చేసిందని తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా డైరెక్టర్ రవీంద్ర పుల్లె వెల్లడించడంతో అంతా షాక్ అవుతున్నారు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక పాత్ర చాలా ప్రభావ వంతంగా ఉంటుందని, ఆమె ప్రదర్శించే కోపం, ఆవేః ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయన్నారు.

ఇటీవల కేరళలోని అతిర జలపాతం వద్ద అత్యంత క్లిష్టమైన ఓ యాక్షన్ సీన్‌ని షూట్ చేశాం. అయితే ఈ సన్నివేశం కోసం రష్మిక 80 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి డూప్ లేకుండా దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా పట్ల, నటన పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి టీమ్ అంతా ఆశ్చర్యపోయాం- అన్నారు.అయితే ఈ విషయం తెలిసిన నెటిజన్‌లు, అభిమానులు మాత్రం స్టార్ హీరోలే రిస్కీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడానికి భయపడుతున్నారు. ఇందు కోసం బాడీ డబుల్‌లని వాడేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి డూప్ లేకుండా ఇలా రిస్క్‌లు చేయడం అవసరమా? అని వాపోతున్నారు. 80 అడుగుల ఎత్తులో నుంచి దూకడం అనేది కరెక్ట్ కాదని, ఇకపై అలాంటి రిస్క్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.





సోనాల్ చౌహాన్ యొక్క పూల్‌సైడ్ ఫోటోషూట్ వైరల్‌గా మారింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965